క్లుప్తంగా

అల్లాదుర్గం ఎస్‌ఐగా శంకర్



అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం ఎస్‌ఐగా శంకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. పెద్దశంకరంపేట ఎస్‌ఐ శంకర్ అల్లాదుర్గంకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమన్నారు.

పేట ఎస్‌ఐగా ప్రవీణ్‌రెడ్డి



పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట మండల నూతన ఎస్‌ఐగా ప్రవీణ్‌రెడ్డి నియమితులయ్యారు. అల్లాదుర్గం ఎస్‌ఐగా పనిచేస్తున్న ఆయన బదిలీపై పెద్దశంకరంపేట ఎస్‌ఐగా వచ్చారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది సన్మానించారు.

ఇందిరమ్మ ఇల్లు కట్టుకుంటే వెంటనే బిల్లులు



నడిమితండాలో ఇందిరమ్మ ఇళ్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అల్లాదుర్గం(మెదక్): ఇందిరమ్మ ఇళ్లు కట్టుకుంటే వెంటనే బిల్లులు అందజేస్తామని ఎంపీడీఓ చంద్రశేఖర్ చెప్పారు. బుధవారం మండల పరిధిలోని నడిమితండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. పనులు చేసిన వారికి బిల్లులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కౌశిక్, కార్యదర్శి జనార్దన్ పాల్గొన్నారు.

చిన్నారుల యోగాసనాలు



మెదక్ కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి ఆవరణలో బుధవారం చిన్నారులకు యోగాసనాలు నేర్పించారు. ఈసందర్భంగా ఆస్పత్రి వైద్యులు మధుమిత మాట్లాడుతూ.. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాసనాలు నేర్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు చిన్నారులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రైతులకు అవగాహన

న్యాల్‌కల్(జహీరాబాద్): రైతులు వేసిన పంటలు మళ్లీ వేయకుండా పంట మార్పిడి చేయాలని జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త తబసుమ్ పాతీమా సూచించారు. రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని హద్నూర్ రైతు వేదికల్లో పంటల సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నిసార్లు చెప్పినా చాలా మంది రైతులు వేసిన పంటలనే మళీమళ్లీ వేస్తూ సరైన దిగుబడులు రాక నష్టపోతున్నారని అన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడడం వల్ల లాభాలకంటే నష్టమే ఎక్కువ జరుగుతుందన్నారు. నీటిని వృథా చేయకుండా డ్రిప్ విధానం ద్వారా పంటలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవ సా య శాస్త్రవేత్త˜ వారికుమార్, ఏఈఓలు రమేష్, మాదవితో పాటు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కానరాని పీసీబీ అధికారుల జాడ



వాగులోకి విడుదల చేసిన రసాయన వ్యర్థాలు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం పారిశ్రామికవాడలో పరిశ్రమల నుంచి రసాయన వ్యర్థాలు విచ్చలవిడిగా బహిరంగ ప్రదేశాల్లోకి విడుదల చేస్తున్నారని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామికవాడలోని విష్ణు కెమికల్ పరిశ్రమ వెనక భాగం నుంచి వాగులోకి మంగళవారం పెద్ద ఎత్తున రసాయన వ్యర్థ విడుదల చేశారు. గతవారం పసుపు పచ్చరంగు వ్యర్థాలు, ప్రస్తుతం నల్ల రంగులో వ్యర్థాలు విడుదలయ్యాయి. దీంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. విష్ణు కెమికల్ పరిశ్రమ తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాగే కొనసాగితే కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

దొడ్డు ధాన్యమే అధికం

- యాసంగిలో సాగు చేసిన రైతులు
- 2.45 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి
- సన్నరకం 58 వేల మెట్రిక్ టన్నులే..



మెదక్‌లోని ఓ సెంటర్‌లో ధాన్యం కొనుగోళ్లు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఈ ఏడాది యాసంగిలో 2.46 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా, అత్యధికంగా దొడ్డురకం వరినే సాగు చేశారు. గత వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ అందించింది. దీంతో యాసంగిలో సన్నాల సాగు పెరుగుతుందని అధికారులు అనుకున్నారు. ఈ మేరకు 3.89 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. ఇందులో భాగంగా కొనుగోలుకు కేంద్రాలను సైతం పెంచారు. జిల్లావ్యాప్తంగా దొడ్డురకం ధాన్యంకు 406, సన్నరకం ధాన్యం కొనుగోలుకు ప్రత్యేకంగా 92 చొప్పున మొత్తం 498 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్, రైతు సంఘాల ఆధ్వర్యంలో సెంటర్లు కొనసాగాయి. కాగా సన్నరకం వరి సాగు చేస్తే నీటి అవసరం, యజమాన్య పద్ధతులు, పెట్టుబడి ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. సన్నరకం వరి సాగు చేస్తే దిగుబడి సైతం తక్కువే. వేసవిలో నీటి కొరత ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు చాలా వరకు దొడ్డురకం వరిని సాగు చేశారు. దొడ్డు రకం వరి సాగు చేస్తే నీటి కొరతను తట్టుకుంటుంది. యజమాన్య పద్ధతులు, పెట్టుబడి ఖర్చు సైతం తగ్గుతాయి.

మరో 60 సెంటర్లలో కొనుగోళ్లు

జిల్లాలో ఇప్పటివరకు 402 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాగా, మరో 60 కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఈ కొనుగోలు కేంద్రాల వద్ద 56,533 మంది రైతుల నుంచి దొడ్డు రకం ధాన్యం 2,45,258 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందుకు గానూ సంబంధిత రైతుల ఖాతాల్లో రూ.489 కోట్లు జమ చేశారు. అలాగే జిల్లావ్యాప్తంగా 10,895 మంది రైతుల నుంచి 58 వేల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధిత రైతుల ఖాతాల్లో రూ. 122 కోట్లు జమ చేశారు.

వానాకాలంలోనూ అదే సాగు

రబీ సీజన్‌లో రైతులు ఎక్కువగా దొడ్డురకం వరి సాగు చేసినప్పటికీ వానాకాలం సీజన్‌లో సన్నరకం వరి సాగుచేసే అవకాశం ఉంది. వర్షాలతో నీటి వసతి ఉంటుంది. దీనికి తోడు ప్రభుత్వం సన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రకటించింది. మరోవైపు రూ. 500 బోనస్ ఇస్తుంది. దీంతో ఈసారి అధికంగా రైతులు సన్నరకం వరి సాగు చేస్తారు. ప్రభుత్వం రేషన్ షాపుల నుంచి సన్నబియ్యం ఇస్తున్నప్పటికీ రైతులు అధికంగా సన్న రకం సాగుకే మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



ప్రధానోపాధ్యాయుడు చంద్రప్రకాశ్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ రెడ్డి అన్నారు. బుధవారం పెద్దశంకరంపేట ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గజ్వాడ చంద్రప్రకాష్ పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని చెప్పారు. విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మెదక్ డీఈఓ రాధాకిషన్, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్, సీడీపీఓలు జయరామ్‌నాయక్, పద్మలత, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఏఎస్‌ఓ నవీన్, గోపి, శ్రీనివాస్, రామచంద్రాచారి, ప్రసన్నకుమార్ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా మట్టిరోడ్డు పనులు



ముమ్మరంగా నక్షబాటలో మట్టి పనులు

శివ్వంపేట(నర్సాపూర్): నక్షబాట పునరుద్ధరణ పనులను రైతులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పలు వ్యవసాయ పొలాలకు, కరీంకుంటకు సంబంధించిన నక్షబాటను అక్రమార్కులు కబ్జా చేసి పలు కట్టడాలు చేయడంతో మూడు రోజుల క్రితం రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి నక్షబాటకు సంబంధించి హద్దులు ఏర్పాటు చేశారు. అక్రమంగా నిర్మించిన పలు కట్టడాలను అధికారులు కూల్చివేశారు. సుమారు రెండు కిలో మీటర్ల నక్షబాటకు మట్టిపోసి చదును చేస్తున్నారు. పలువురు రైతులు స్వచ్ఛందంగా జేసీబీ, డ్రోజర్ ఏర్పాటు చేసుకుని 20 ఫీట్ల మట్టి రోడ్డుని పునరుద్ధరిస్తున్నారు. నక్షబాట పునరుద్ధరించడం పట్ల రైతులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

గ్రామీణ సంస్కృతికి ప్రతీకలు

జీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్న మైనంపల్లి



గొల్ల కురుమలతో మాట్లాడుతున్న మైనంపల్లి

పాపన్నపేట(మెదక్): బీరప్ప ఉత్సవాలు గ్రామీణ సంస్కృతికి ప్రతీకలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. బుధవారం పాపన్నపేట మండలం ఆరెపల్లి గ్రామంలో జరిగిన బీరప్ప కల్యాణం కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. మహనీయుల జీవితాలు నేటి యువతకు ఆదర్శంగా ఉండాలన్నారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కురుమ సంఘం నాయకులు మల్లేశం, బీరప్ప, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ త్యార్ల రమేష్ మాజీ జెడ్పీటీసీ మల్లప్ప, మండల పార్టీ అధ్యక్షులు గోవింద్ నాయక్, కిసాన్ సెల్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

బీరప్ప ఆలయానికి విద్యుత్.. బోరు మంజూరు

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండలం కొడుపాకలో నూతనంగా నిర్మించిన బీరప్ప ఆలయానికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కొత్త విద్యుత్ లైను, సింగిల్ ఫేజ్ ట్రాన్స్ ఫార్మర్, బోరు మోటారు మంజూరు చేసినట్లు మాజీ సర్పంచ్ పంతుల భూమయ్య తెలిపారు. ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు బీరప్ప ఆలయం వద్ద పోచమ్మ పండుగ, బీరప్ప కల్యాణం జరగనున్న నేపథ్యంలో వందలాది భక్తులు రానున్నారని తెలిపారు. గ్రామంలోని కురుమ కులస్తుల అవసరాన్ని అర్థం చేసుకొని, విద్యుత్ సౌకర్యం కల్పించారని చెప్పారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండల పరిధిలోని బద్యాతాండాలో రోడ్డు పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మరమేష్ బుధవారం ప్రారంభించారు. రూ.40లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేష్ గౌడ్, ఎల్లంపల్లి కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్, మండల కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. బుధవారం వారిని కోర్టులో హాజరు పరచగా ఆరుగురికి రూ. వెయ్యి, మరోఆరుగురికి రూ.1500 చొప్పునా జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

తడి పొడి చెత్తపై అవగాహన



దంపతులను సన్మానిస్తున్న కమిషనర్

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ ఆదేశాల మేరకు బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నా రు. బుధవారం నగర పరిధిలోని పలు వార్డుల్లో కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారు లు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి మహిళలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. కంపోస్ట్ ఎరువు తయారీలో తడి చెత్త ఆవశ్యకతను వివరించారు. అనంతరం ఇంటి పైకప్పుపై ఓ దంపతులు నిర్వహిస్తున్న సేంద్రియ వ్యవసాయాన్ని పరిశీలించారు. కూరగాయ పంటలు పూలు పండ్లు పండిస్తున్న విధానాన్ని అభినందిస్తూ కమిషనర్ దంపతులను ఘనంగా సన్మానించారు.

పంటల మార్పిడి తప్పనిసరి

వ్యవసాయ శాస్త్రవేత్తలు



సాగు పద్ధతులపై వివరిస్తున్న శాస్త్రవేత్తలు

నర్సాపూర్ రూరల్: ప్రతి రైతు పంటల మార్పిడి తప్పనిసరి అలవర్చుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సూచించారు. బుధవారం నర్సాపూర్‌తో పాటు మండలంలోని ఇబ్రహీంబాద్‌లో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా ×రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం°నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ గీత, డాక్టర్ రంజిత, డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ పంటలు సాగు చేసే భూముల్లో తరచూ పంటలు మార్పిడి చేసి సాగు చేయాలన్నారు. భూసార పరీక్షలు చేయించుకుని దాని రిపోర్ట్ ఆధారంగా పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు, విత్తనాల కొనుగోలు, ఎరువుల వాడకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. దీంతోపాటు పచ్చి రొట్ట ఎరువుల వాడకంపై కూడా రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దీపిక, ఏఈఓ చంద్రవేణి, తేజస్విని, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

కురుమలు సుభిక్షంగా ఉండాలి

బీఆర్ఎస్ నేత తిరుపతిరెడ్డి



ఆరెపల్లిలో బీరప్ప కల్యాణంలో పాల్గొన్న తిరుపతి రెడ్డి

పాపన్నపేట(మెదక్): మూగ జీవాలను నమ్ముకొని జీవించే కురుమలు సుభిక్షంగా ఉండాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంతారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని ఆరెపల్లిలో జరిగిన బీరప్ప కల్యాణ ఉత్సవానికి హాజరయ్యారు. ఉత్సవ నిర్వహణకు రూ.20 వేలు విరాళంగా ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ.. మూగ జీవాలను నమ్ముకొని జీవించే కురుమలు శ్రమైక జీవనానికి ప్రతిరూపాలని చెప్పారు. అనంతరం ఆరెపల్లిలో ఇటీవల మరణించిన బీఆర్ఎస్ నాయకులు పుండరీకం, యూసుఫ్‌పేటలో శశిందర్ రెడ్డి కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు జగన్ ,శ్రీనాథ్‌రావు, సాయిలు, శ్రీనివాస్, మాణిక్ రెడ్డి, రమేష్, మాణిక్యరావు, గోపాల్‌రావు ఉన్నారు.

ప్రగతి ధర్మారంలో మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారంలో బుధవారం హైదరాబాద్‌లోని సూరారం మల్లారెడ్డి ఆసుపత్రి వారు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి పరీక్షలు, ఈసీజీ, ఆర్థో, సయాటికా, వెన్ను నొప్పి, ఇతర వ్యాధులకు సంబంధించి డాక్టర్లు పరీక్షించి మందులు అందజేశారు. ఆపరేషన్లు అవసరమైన వారిని హైదరాబాద్ ఆసుపత్రికి తరలించి ఉచితంగా నిర్వహిస్తామని వైద్యులు పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా కోశాధికారి శ్రీనివాసశర్మ, సభ్యులు మాసాయిపేట మల్లేశం, సత్యం, మాజీ ఎంపీటీసీ సిద్దిరాంరెడ్డి, ఆసుపత్రి వైద్యులు ఉమ, శ్రీసాయి, నిఖిల్, విజయ కుమార్, నాయుడు, మధురిక, ఆసుపత్రి మార్కెటింగ్ ఇన్‌చార్జి రవిశంకర్ పాల్గొన్నారు.

విత్తన, సాగుపై అవగాహన

- రైతులకు శాస్త్రవేత్తల సూచనలు
- మల్కాపూర్‌లో వికసిత కృషి- సంకల్ప అభియాన్ కార్యక్రమం



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తూప్రాన్: ఖరీఫ్ సాగులో అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలు, సాగుపై రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని మల్కాపూర్‌లో వ్యవసాయ అధికారి గంగా మల్లు, వ్యవసాయ విస్తరణాధికారి సింధు ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు కృషి విజ్ఞాన కేంద్రం (తునికి) ఫార్మ్ మేనేజర్ భారతీ రాజా, ఎన్‌బీపీజీఆర్ శాస్త్రవేత్త ప్రసన్న, శాస్త్రవేత్త డాక్టర్ పాపా రావు, రైతులకు అవగాహనతో పాటు శిక్షణ ఇచ్చారు. వరి పంట సాగులో అధిక దిగుబడినిచ్చే మేలైన రకాలు కెఎన్ఎం-1638, ఆర్ఎన్ఆర్-31479, జేజీఎల్-24423, కెఎన్ఎం-118, సాగు చేసుకోవాలని సూచించారు. వరి పంట నష్టపరిచే కాండం తొలుచు పురుగు, సుడి దోమ, గింజ మచ్చ తెగులు నివారణ యాజమాన్య పద్ధతులను తెలిపారు. అలాగే రసాయన ఎరువులతో పాటు పచ్చిరొట్ట పంటలు జీలుగు, జనుము, జీవన ఎరువులు వాడుతూ అధిక దిగుబడి పొందవచ్చని సూచించారు. ముఖ్యంగా రైతులు విత్తనాలు కొనే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం (తునికి) ఫార్మ్ మేనేజర్ భారతిరాజా, ఎన్‌బీపీజీఆర్ శాస్త్రవేత్త ప్రసన్న, శాస్త్రవేత్త డాక్టర్ పాపా రావు, తూప్రాన్ మండల ఏఓ గంగామల్లు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న జగదీశ్వర్ గుప్తా



దుర్గాభవాని మాతను దర్శించుకున్న జగదీశ్వర్ గుప్తా కుటుంబ సభ్యులు

పాపన్నపేట(మెదక్)/చిలప్‌చెడ్(నర్సాపూర్): ఏడుపాయల వనదుర్గ భవానీ అమ్మవారిని, అలాగే.. చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ చాముండేశ్వరి అమ్మవారిని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నేత తడక జగదీశ్వర్ గుప్తా బుధవారం దర్శించుకున్నారు. కుంకుమార్చన, ప్రత్యేక పూజలు జరిపించారు. అర్చకులు గుప్తా కుటుంబసభ్యులకు తీర్థ,ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం హామీల అమల్లో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం తగదన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

యూరియాను తగ్గించాలి

శాస్త్రవేత్త డాక్టర్ శోభ



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ శోభ

చిన్నశంకరంపేట(మెదక్): రైతులు పంటల సాగులో వ్యవసాయ అధికారుల సూచన మేరకే యూరియాను వాడాలని వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ శోభ సూచించారు. బుధవారం నార్సింగి మండలం శేరిపల్లిలో రైతు ముంగిట వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పంటలసాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు సాగు భూముల్లో యూరియాను ఎక్కువ మోతాదులో వాడడంతో వృథాగా పోవడంతో పాటు అనవసర వ్యయం పెరుగుతుందని చెప్పారు. యూరియా ఎక్కువ మోతాదులో వాడటంతో పంటలకు చీడ పురుగు ఉధృతి పెరుగుతుందని చెప్పారు. రైతులు జీవన ఎరువులు, సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. అధిక దిగుబడికి అవసరమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్, ఏఓ హరిప్రసాద్, ఏఈఓ విజృంభణ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి చెప్పారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్‌ఓసీలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసిన అందరికి పథకం నుంచి సహాయం అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు నవీన్ గుప్తా, హరీష్‌వర్ధన్ తదితరులు ఉన్నారు.

◆ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జిగా యాదగిరి

వెల్దుర్తి(తూప్రాన్): ఎమ్మార్పీఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా సీనియర్ నాయకులు, మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన యాదగిరి రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

◆ నాగాపూర్‌లో విగ్రహ ప్రతిష్ఠ

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని నాగాపూర్‌లో కొనసాగుతున్న గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు. వారికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రాములు, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు దరఖాస్తుల వెల్లువ



కాడిపల్లి(నర్సాపూర్): దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి



రామాయంపేట(మెదక్): మాట్లాడుతున్న ఆర్డీవో రమాదేవి

నర్సాపూర్ రూరల్: భూభారతి రెవెన్యూ సదస్సులకు బుధవారం దరఖాస్తులు వెల్లువెత్తాయి. మండలంలోని రామచంద్రాపూర్, నారాయణపూర్, మల్పర్తిలో నిర్వహించిన సదస్సులకు 85 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. దరఖాస్తులను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేష్, ఆర్ఐ సిద్దిరాంరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూభారతితో రైతులకు మేలు

అల్లాదుర్గం(మెదక్): భూభారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందని తహసీల్దార్ మల్లయ్య చెప్పారు. బుధవారం మండల పరిధిలోని వెంకట్‌రావ్‌పేటలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కరం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతుల సమస్యలు ఈ సదస్సులో అధికారుల దృష్టికి తెస్తే పరిష్కరం అవుతాయని ఆయన చెప్పారు.

భూ సమస్యలుంటే దరఖాస్తు చేసుకోండి

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు భూసమస్యలుంటే దరఖాస్తు చేసుకోవాలని నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని ముత్రాజ్‌పల్లి, తునికి గ్రామాలలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా భూభారతి గ్రామ సభలలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. ఈసందర్భంగా ముత్రాజ్‌పల్లిలో 79, తునికిలో 76 మంది భూసమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ జహీర్, ఆర్ఐ శ్రీహరి, మండల మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీన్‌కుమార్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

67 దరఖాస్తులు

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్, హవేళిఘణాపూర్ మండలాల్లో రెండో రోజు రెవెన్యూ అధికారులు భూభారతి సదస్సును నిర్వహించారు. మండల పరిధిలోని శాలిపేట, బొగుడ భూపతిపూర్ గ్రామాల్లో నిర్వహించిన భూభారతి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫౌతి, సాదాబైనామా తదితర దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింధూరేణుక, గిర్దావర్ ఆబేద్ పాల్గొన్నారు.

భూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం

రామాయంపేట(మెదక్): మండలంలోని లక్ష్మాపూర్‌లో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సును మెదక్ ఆర్డీవో రమాదేవి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. రైతులు భూసంబంధిత సమస్యలను ఈ సదస్సులో అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): భూ సమస్యల పరిష్కరం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కమలాద్రి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అల్లీపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సాదా బైనామా, మ్యుటేషన్, తదితర సమస్యలకు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. అల్లీపూర్‌లో 99, తిమ్మాపూర్‌లో 29 దరఖాస్తులు వచ్చినట్లు ఆర్ఐ కిషన్ తెలిపారు.